

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

హాజరుకానున్న 30,652 మంది విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మార్చి 1 నుండీ 20వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానున్నాయి. అలాగే పదో తరగతి పరీక్షలు ఈనెల 17 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరుగుతాయి. ఇంటర్ విద్యార్థులు ఇప్పటికే హాల్ టికెట్లు ఆన్‌లైన్ ద్వారా పొందారు. ఇంటర్, పది పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా మార్చి ఒకటి నుండీ ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇండర్మీడియట్ డీవీఈవో సయ్యద్‌మౌళా తెలియజేశారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం జిల్లా స్థాయిలో ఇంటర్మీడియట్ ప్రిన్సిపాల్స్‌లో జిల్లా కలెక్టర్ సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం 50 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుండీ మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షలు హాజరుకానున్న విద్యార్థులు తమ హాల్ టికెట్లు తీసుకొని ఉదయం 8.30 గంటలకు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని ఇంటర్ విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం 15,170 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 21,248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అలాగే ఏప్రిల్ 1వతేది వరకు పది పరీక్షల కోసం పదో తరగతి విద్యార్థులు 118 కేంద్రాలను ఎంపిక చేశారు. పదో తరగతి పరీక్షలు హాజరుకానున్న విద్యార్థులకు ఉదయం 9.30 గంటల నుండీ 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షా సమయానికి అరగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోని హాల్‌టికెట్లను పరిశీలించుకోవాలని కోరుతున్నారు. ఈ ఏడాది ఇంటర్, పది పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు కనీస మౌలిక వసతులు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఆర్‌టిసి బస్సుల ఏర్పాటు చేశారు. ఇంటర్, పది పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఉండాలని, సామాజిక మాధ్యమాలు టీవి, సెల్‌ఫోన్సుకు దూరంగా ఉండాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

'సంక్షేమానికి' కోత.. 'విజన్'కు వాత..!

- నీటి ప్రాజెక్టులకు నిధులు నిల్
- 'మినిమం టైంస్కేల్' ఊసేలేదు
- 'సూపర్‌సిక్స్'లో రెండే అమలు



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'కూటమి' ప్రభుత్వంపై జిల్లా ప్రజానీకం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వీరి ఆశలు అడియాశలయ్యాయి. 'సూపర్‌సిక్స్' పథకంలో తల్లికి ఇందనం, అన్నదాత సుఖీభవ మినహా మరో రెండింటి ఊసేలేదు. ఉపాధ్యాయ, ఉద్యోగులు, పెన్షనర్లకు తీవ్ర నిరాశే మిగిల్చింది. జిల్లాలో తెలుగుగంగ, సోమశిల-స్వర్ణముఖి, గాలేరి నగరిలకు పైసా విదల్చలేదు. హంద్రీనీవా కాల్వ విస్తరణకు, వారి జీతాలకు 14లక్షల 90వేల 71 రూపాయి కేటాయించారు. మధ్యతరగతి ప్రాజెక్టులు గమనంలో లేవనే చెప్పాలి. 'విజన్-2047' అని చెబుతున్నా అవేమీ ఈ బడ్జెట్‌లో కేటాయించకపోవడం గమనార్హం. ఉగాది నుంచి 'పి4' అమలు చేస్తామని, తద్వారా రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని ముఖ్యమంత్రి చెబుతున్నారు. అయితే 'విజన్-2047' వ్యూహం ఏంటో, నిధులు ఎక్కడినుంచో తెస్తారో స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్-2025-26ను ప్రవేశపెట్టారు. 3లక్షల 22వేల 359 కోట్లుగా వెల్లడించారు. నీటి ప్రాజెక్టులకు 32వేల కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రీత్యా 21వేల కోట్లు కేటాయిస్తున్నట్లు చెప్పారు. అందులోనూ 3వేల కోట్లు తగ్గించి 18వేలు కోట్లుగా ప్రకటించారు. మొత్తం బడ్జెట్‌లో ఆరువేల కోట్లు పోలవరం ప్రాజెక్టుకు వెళితే, మిగిలిన 12వేల కోట్లు రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు కేటాయింపులు విదిల్చినట్లయ్యింది. ఈ నిధులు సిబ్బంది వేతనాలకు, ప్రాజెక్టుల నిర్వహణకే సరిపోదన్నది ఇంజినీర్లు పెదవి విరుస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లో నీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తి చేసి 2లక్షల ఎకరాలకు నీరు ఇవ్వాలంటే 10వేల కోట్లు కేటాయించాలని రాయలసీమ మంత్రులు, ఎంఎల్‌ఎలు సిఎంను కలిసినా ప్రయోజనం లేకపోయింది. కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నిధులు తెస్తామని సిఎం ఇచ్చిన హామీలో భాగంగానే ఆ ప్రాజెక్టుకు అంతోఇంతో నిధులు కేటాయించడం గమనార్హం. పద్మావతి, వెటర్నరీ, ఎస్వీయూ, అగ్రికల్చర్ యూనివర్సిటీ కొత్త భవనాలకు, పాత భవనాల మరమ్మతుకు కోటి రూపాయలు కేటాయించారు.

ప్రజా సంక్షేమానికి తోడ్పడే దిగా లేదు

సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు



రాష్ట్ర బడ్జెట్ రూ.3.22లక్షల కోట్ల అంచనా వ్యయంతో ప్రవేశపెట్టిన భారీ బడ్జెట్, రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తోడ్పడేదిగా లేదని సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు విమర్శించారు. లక్షల కోట్లు అదనంగా అప్పు తేబోతున్నారు. మరో 80 వేల కోట్లు ద్రవ్యలోటు ఉంది. దాన్ని పూడ్చుకోడానికి ప్రజలపై అదనపు భారాలు వేసేదిగా ఉంది. పన్ను ఆదాయం 14 వేల కోట్లు, పన్నేతర ఆదాయం 12 వేల కోట్లు పెంచి చూపడం ద్వారా ఇది ప్రజలపై భారాలు పెంచుతుంది లేదా అనుకున్న ఆదాయం రాలేదంటూ పథకాలకు కోతపెట్టే ప్రమాదముంది. అన్ని పథకాలకు కేటాయింపులు చూపడం కోసం ఆచరణాత్మకం కాని ప్రతిపాదనలు చేసినట్లు అనిపిస్తోంది. ప్రజలకు పెను భారంగా మారిన విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల విధింపు గురించి ప్రస్తావించిన మంత్రి రాష్ట్రాన్ని పాతికేళ్ళపాటు దోచుకుతినే సెకి ఒప్పందాన్ని రద్దు చేయడం గురించి పల్లెత్తు మాట అనకపోవడం దారుణం. ప్రతిపక్షంలో ఉండగా మీడియాకు పుంఖాను పుంఖాలుగా చెప్పడం, హైకోర్టుకు సైతం ఎక్కిన ప్రస్తుత ఆర్థిక శాఖా మంత్రి ఇప్పుడు ఈ అంశంపై పెదవి విప్పకపోవడం ప్రజలను వంచించడమే. వ్యవసాయం, ఇరిగేషన్, సంక్షేమ కార్యక్రమాలకు గత బడ్జెట్‌కన్నా పెరుగుదల పెద్దగా లేదు. పైగా తల్లికి వందనం కేటాయింపులు తగ్గాయి. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలకు కేటాయింపులు చూపినా టిడిపి కూటమి మేనిఫెస్టోలో పేర్కొన్న యువతకు నిరుద్యోగ భృతి గురించి మాట మాత్రం ప్రస్తావించకపోవడం అన్యాయం. ఇప్పటికే మెగా డీఎస్సీ రాకపోవడం, గ్రూప్-2 పరీక్ష విషయంలో నిరాశ చెందిన యువతకు ఈ బడ్జెట్ హతాశులను చేసింది. ఆప్కాస్ రద్దు చేసి తిరిగి పాత కాంట్రాక్టు పద్ధతి పునరుద్ధరించడం ఉద్యోగులు, కార్మికుల్ని అభద్రతకు గురిచేస్తుంది. గత ఏడాది ఆందోళన చేసిన అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్ వర్కర్లకు ప్రతిపక్షంలో ఉండగా న్యాయం చేస్తామని చెప్పి ఇప్పుడు అధికారానికి వచ్చిన కూటమి తాజా బడ్జెట్‌లో వారికి మొండిచెయ్యి చూపడం "ఏరు దాటే వరకు ఓడ మలయ్య.." సామెతను గుర్తు చేస్తోంది. గత ప్రభుత్వం కన్నా ఎక్కువగా అప్పుల ఊబి, భారాల మోత తప్పని స్థితిని ప్రభుత్వం తీసుకొస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి భారాలు పడకుండా ఎదుర్కోవాలి.

సమగ్రాభివృద్ధికి భరోసా కల్పించేలా ఉంది

చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



పల్లె ప్రాంతాల ప్రగతి, మూల ధన వ్యయం పెంపుతో భవిష్యత్తుకు పునాది వేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది. సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి భరోసా కల్పించేలా ఉంది. వసతుల కల్పన, పెట్టుబడుల ఆకర్షణకు అద్భుత అవకాశముంది. సూపర్ సిక్స్ పథకాల అమలు దిశగా కేటాయింపులు జరపడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. పంచాయతీరాజ్ శాఖకు భారీ కేటాయింపులతో పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతుంది. మూలధన వ్యయం భారీగా పెంచడం వల్ల పెట్టుబడుల ఆకర్షణకు అవకాశాలున్నాయి.

ప్రజా అనుకూల బడ్జెట్

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్



పూర్తిస్థాయి బడ్జెట్ ఇదే అని రూ.3,22,359 కోట్లు ప్రవేశ పెట్టిందని తెలుగుదేశం రాష్ట్ర అధికారప్రతినిధ సురేంద్రకుమార్ తెలిపారు. బడ్జెట్లో రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలకు సమప్రాధాన్యత ఇచ్చి స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేయడం జరిగిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్లో నిధులు కేటాయించడం ద్వారా ఆ పథకాల అమలుపై కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నట్లు తెలిపారు.

హామీల అమలు దిశగా కేటాయింపులు

ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్

ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే దిశగా సూపర్ 6ను సాకారం చేయడంలో భాగంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్లో కేటాయింపులు చేసింది. రాష్ట్ర బడ్జెట్లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది ప్రభుత్వం. రాష్ట్రానికి మంచి జరిగేలా, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడుతూ, ఎన్నికల హామీలకు అవసరమైన నిధులను కేటాయించడం శుభ పరిణామమన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, వ్యవసాయ రంగానికి, విద్యా, వైద్య, శాఖలకు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివద్ధి శాఖకు సమచితస్థాయిలో కేటాయింపులు జరిగాయన్నారు. బడ్జెట్లో మొదటిసారిగా భాషాభివృద్ధికి నిధులు కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు.

ప్రజాసంక్షేమానికి సంపూర్ణ బడ్జెట్

ఏపీఎస్ ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం

కుప్పం టౌన్: రాష్ట్ర శాసనసభలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెట్టారని కుప్పం టిడిపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏపీఎస్‌ఆర్టీసీ ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబులు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించడం హర్షించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన మొట్టమొదటి పూర్తిస్థాయి బడ్జెట్‌లో సంక్షేమానికి, అభివృద్ధికి, హామీల అమలుకు సమ ప్రాధాన్యత ఇచ్చి స్వర్ణాంధ్ర నిర్మాణానికి బాటలు వేయడం జరిగింది. పేద, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, రైతుల, మహిళల కొనుగోలు శక్తి పెరిగేలా, ప్రాంతీయ అసమానతలు అధిగమించేలా అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా బడ్జెట్ రూపొందించారు. మేనిఫెస్టో అమలుకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యత ఇవ్వడం ప్రభుత్వం చిత్తశుద్ధికి అద్దం పడుతుంది.


నేడు జిల్లాకు ముఖ్యమంత్రి రాక

- జోరుగా పర్యటన ఏర్పాట్లు
- ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ: కలెక్టర్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక రోజు చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా మార్చి 1న జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గంగాధర నెల్లూరు మండలంలో 1న ముఖ్యమంత్రి చేతుల మీదుగా లబ్ధిదారుల ఇంటి వద్దే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి శనివారం ఉదయం 11.50 గంటలకు జిడి.నెల్లూరు మండలం రామానాయుడుపల్లి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ చేరుకుంటారని, ప్రజాప్రతినిధులు, అధికారుల నుండి స్వాగత సత్కారాలు అందుకున్న అనంతరం మధ్యాహ్నం 12 నుండి 12.20 గంటలకు వరకు ప్రజాప్రతినిధుల సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. ఒంటి గంటకు జి.డి. నెల్లూరు మండల కేంద్రం చేరుకుని 1.30 గంటల వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారుల ఇంటి వద్దకు చేరుకుని పెన్షన్ పంపిణీ చేయనున్నారన్నారు. 1.55 గంటల వరకు పది సూత్రాలు అంశంపై వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తారని, అనంతరం 1.55 నుండి 2.55 గంటల వరకు గ్రామస్తులతో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించనున్నారన్నారు. 3గంటలకు రామానాయుడుపల్లి చేరుకుని స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశంలో పాల్గొంటారని, 3.30 గంటలకు హెలిప్యాడ్ చేరుకుని తిరుపతి తిరుగు ప్రయాణం అవుతారని కలెక్టర్ తెలిపారు.

జోరుగా జరుతున్న సిఎం పర్యటన ఏర్పాట్లు

సిఎం చంద్రబాబు నాయుడు ఒక రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం జీడి నెల్లూరు దళితవాడ, రామానాయుడుపల్లిలో సభావేదిక, హెలిప్యాడ్ ఏర్పాటుకు సంబంధించి జోరుగా ఏర్పాట్ల పై రాష్ట్ర సీఎం కార్యక్రమాల సమన్వయకర్త పి.వెంకటేష్, ప్రభుత్వ విప్ డాక్టర్ వి.ఎం థామస్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలుతో కలసి పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతానికి అన్ని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడ ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా ఎవరికి కేటాయించిన విధులను వారు సమర్థవంతంగా నిర్వహించేలా బాధ్యతతో పని చేయాలన్నారు. కాన్వాయ్ నిర్వహణ, ప్రజావేదిక, సంబంధిత అంశాలపై చర్చించారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడ పీడీ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, అడిషనల్ ఎస్‌పి నందకిషోర్, డిటిసి నిరంజన్‌రెడ్డి, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, చిత్తూరు, పలమనేరు ఆర్డీఓలు శ్రీనివాసులు, భవానీ, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా టిడిపి అధ్యక్షుడు సిఆర్ రాజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శనలు

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

అపోలో విశ్వవిద్యాలయంలో విజ్ఞాన ప్రదర్శన



చిత్తూరులో..


ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అపోలో విశ్వవిద్యాలయంలో జాతీయ విజ్ఞాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి 70కి పైగా పాఠశాలల విద్యార్థులు పాల్గొని, సైన్స్, టెక్నాలజీ రంగాలలో 175కు పైగా ప్రాజెక్ట్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో 500కి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఐఐటి తిరుపతి సివిల్, పర్యావరణ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ సురేష్ జైన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదు విభాగాలలో అత్యుత్తమ ప్రాజెక్టులకు ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున, మరో ఐదు విభాగాలలో ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున, ఇతర ఉత్తమ ప్రాజెక్టులకు ఒక్కొక్కరికి రూ.2వేలు చొప్పున నగదు బహుమతులు అందజేయడం జరిగింది. ప్రదర్శనలో కత్రిమ మేధస్సు, పర్యావరణ పరిరక్షణ, స్థిరమైన అభివృద్ధి, వాతావరణ మార్పులు, అంతరిక్ష పరిశోధన మొదలైన అంశాలపై విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్వాహకులు, ప్రొఫెసర్ కె. భాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్ ఆర్. సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే స్థానిక విజయం విద్యాసంస్థల్లో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శైలజమూర్తి సందర్శించి ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి విజేతలకు బహుమతులు అందించారు. స్థానిక సంతపేటలోగల బృందావన్ స్కూల్లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. వర్కింగ్ మోడల్ నమూనాలతోపాటు రోబోటిక్ వర్కింగ్ మోడల్ కూడా ప్రదర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ శైలజాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐరాల: మండలంలోని పొలకలలో 22 జిల్లా పరిషత్ పాఠశాలు, ఐరాలలో 15 గవర్నమెంట్ హైస్కూల్స్, ఎంపైపల్లి 17 జిల్లా పరిషత్ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూల్ కాణిపాకంలో 12 పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎంఈఓలు రుశేంద్రబాబు, దామోదర్ నాయుడు విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాలను పరిశీలించి బహుమతులు అందజేశారు.

చౌడేపల్లి: చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా సైన్స్ డేను నిర్వహించారు. క్లస్టర్ పరిధిలోని 20 పాఠశాలల విద్యార్థులు తమ నమూనాలను ప్రదర్శించారు. ఎంఈఓ తిరుమలమ్మ, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు రెడ్డి, పిజిపి సుదర్శన్ విద్యార్థులకు బహుమతులు అందించారు.

కార్వేటినగరం: భావి భారత పౌరులైన విద్యార్థుల్లో శాస్త్రీయ వైఖరిని, దృక్పథాన్ని పెంపొందించాల్సిన బాధ్యత నేటితరం ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశిక్షణ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ అన్నారు. శుక్రవారం డైట్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే సైన్సు నమూనాలను తయారు చేయించడం ద్వారా నూతన ఆవిష్కరణలకు నాంది పలుకుతుందన్నారు. మండలంలోని కత్తెరపల్లి, డీఎం పరం, కేఎం పురం, పాదిరికుప్పం, ఆర్కేవీబీ పేట, టీకేఎం పేట గంగమాంబాపురం, కార్వేటినగరం మండల కేంద్రంలోని ఆర్కేఎస్సార్ బాలుర ఉన్నత పాఠశాల, జడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్, ఎంఈవో 2 మనోజ్ కుమార్, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యాదమరి: యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైజ్ఞానిక ప్రదర్శన పాఠశాల నుంచి క్లస్టర్‌స్థాయిలో ఏర్పాటు చేసి బహుమతులు అందజేయడం జరిగింది. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో అపోలో యూనివర్సిటీ వారు నిర్వహించిన విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో జీవశాస్త్ర విభాగంలో డి.కే.చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న త్రిషకు ప్రథమ బహుమతి సాధించి రూ.5వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.



పులిచెర్లలో..

రొంపిచర్ల: మండలంలోని సిఆర్‌సి పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఎంఈఓలు డి.శ్రీనివాసులు, ఎన్.ఇందిరా ఆధ్వర్యంలో నిర్వహించారు. బొమ్మయ్యగారి పల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే పులిచెర్ల మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సిఆర్‌సి పరిధిలోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పలు సైన్స్ పరిశోధనలనుఎంఈఓలు సి.సిద్దరామయ్య, పి.తాతయ్య పరిశీలించారు.



సోమలలో..

సోమల: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని సోమల మండలంలోని ఐదు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించి ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన సోమలలో ఎంఈఓలు కేశవరెడ్డి, శివరత్నమ్మ సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించి విద్యార్థులు తయారు చేసిన 31 నమూనాలను పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకుని అభినందించారు.

పలమనేరు: మండలంలో నూతనంగా ఏర్పడిన ఐదు క్లస్టర్ రిసోర్సెస్ సెంటర్లు అయిన ఉర్దూ ఉన్నత పాఠశాల, గవర్నమెంట్ ఉన్నత పాఠశాల, గర్ల్స్ ఉన్నత పాఠశాల, దొడ్డిపల్లి ఉన్నత పాఠశాల, కొలమాసనపల్లి ఉన్నత పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రాజెక్టును ప్రదర్శించడం జరిగింది. మండల విద్యాశాఖ అధికారిణి పి.లీలరాణి స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న విజ్ఞానప్రదర్శనను ఆసక్తిగా సందర్శించారు.

కుప్పం టౌన్: కుప్పంలోని పలు విద్యాసంస్థల్లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ నారాయణమూర్తి ఆధ్వర్యంలో, ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఆచార్య దొరస్వామి ఆధ్వర్యంలో, కుప్పం పబ్లిక్ స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.

ఉపాధి పని దినాలు 150కి పెంపు..

- కరువు మండలాల్లోని కూలీలకు పండగే...
- 50 రోజుల పని దినాలు పెంపు



కరువు మండలాల్లోని మామిడి తోపులో కందకాలు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి)

కరువు మండలాల్లో ప్రభుత్వం వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కరువు బాధిత ప్రాంతాల్లో జీవనోపాధిని మెరుగుపరచుకోవడానికి పంట నష్టాలను తగ్గించడానికి గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆర్థిక సాయం పొందేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వందరోజుల పని దినాలను అదనంగా మరో 50రోజుల పని దినాలను రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం పెంచింది.

ఖరీఫ్- 2024 కరువు ప్రభావిత ప్రాంతాలైన చిత్తూరు జిల్లాలోని 16 మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించింది. ప్రభుత్వం ఉపాధి కూలీలకు తీపి కబురు చెప్పింది. కరువు మండలాల్లో ఉపాధి పని దినాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయంతో 16 మండలాల్లో పనిదినాలు 150 రోజులకు పెరిగాయి. ఇప్పటికే వంద రోజులు పని దినాలు వినియోగించుకున్న కరువు మండలాల్లో కుటుంబాలు మార్చి నెలాఖరులోగా మిగతా 50 పని దినాలు ఉపయోగించుకోవచ్చు. వెంటనే ఈ 50 అదనపు పని దినాలు అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఉత్తర్వులు పేర్కొంది. అదనపు పని దినాలు ఆయా గ్రామాల్లో ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ల కు ఉత్తర్వులలో సూచించారు.

చిత్తూరు జిల్లాలో మొత్తం 31 మండలాలు ఉన్నాయి. అందులో 700 గ్రామపంచాయతీలు ఉన్నాయి. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2.18 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 12,564 కుటుంబాలు వందరోజుల పనులు పూర్తి చేసుకొని ఉన్నాయి.

జిల్లాలో కరువు మండలాలు ఇవే..

జిల్లాలోని యాదమరి, పెనుమూరు, గుడిపాల, శ్రీరంగరాజపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లి, వెంకటగిరి కోట, గుడిపల్లె, కుప్పం, రామకుప్పం మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. కరువు మండలంలో ప్రభుత్వం వ్యవసాయ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం కొన్ని ప్రత్యేకమైన లబ్ధి పథకాలు అందిస్తాయి. ఈ లబ్ధిపథకాలు కరువు బాధిత ప్రాంతాలలో జీవనోపాధిని మెరుగుపర్చుడానికి, పంట నష్టాలను తగ్గించడానికి, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆర్థిక సాయం చేయడానికి ఉపయోగపడతాయి.

కరువు మండల లబ్ధి పథకాలు:

1. రైతు భరోసా పథకాలు: కరువు పరిస్థితుల వల్ల నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించడం.

2. రుణమాఫీ పథకాలు: రైతుల రుణభారం తగ్గించేందుకు రుణమాఫీ చేయడం.

3. సబ్సిడీ పథకాలు: పంటల విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ పరికరాలపై సబ్సిడీలు ఇవ్వడం.

4. ఉచిత కరవు గ్రాంట్లు: కరువు ప్రభావం కారణంగా నష్టపోయిన రైతులకు, ప్రజలకు ఉచిత నిధులు అందించడం.

5. మనరేగా: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడానికి 100రోజులు పనిని అందించడం.

6. సమగ్ర గ్రామీణ అభివృద్ధి పథకాలు: గ్రామాల్లో నీటి వనరుల, పశుసంపద, మౌలిక వసతుల అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు.

లబ్ధి పొందడం కోసం: ఈ పథకాల లబ్ధి పొందాలంటే స్థానిక అధికారులు లేదా గ్రామ పంచాయతీ ద్వారా వివరాలు సేకరించాలి.



మండలం ఓటివారిపల్లి గ్రామపంచాయతీలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

విరివిగా పనులు కల్పించండి


- రవికుమార్, ఉపాధి పథక సంచాలకులు



చిత్తూరు జిల్లాలో 16 మండలాల్లో కరువు ప్రాంతాలు ప్రభుత్వం గుర్తించింది. ఈ మండలాల్లో ఉపాధి పథం కింద గ్రామీణ ప్రాంతాల్లోని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులను విరివిగా కల్పించాలని ఉపాధి సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది. ఆ దిశగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కూలీలకు, రైతులకు వారికి కావలసిన వ్యవసాయ అనుసంధానమైన పనులు కల్పిస్తున్నాం.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలం నెల్లిపట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఈ ఏడాది పబ్లిక్ పరీక్షలకు అవసరమైన పరీక్షా సామగ్రిని వి కోటకు చెందిన యండిహెచ్ ఎడ్యు కేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత యండి హెచ్ పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా శుక్రవారం అందించారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 62 మందికి రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు వీలుగా ఉచితంగా పెన్నులు, ప్యాడ్లు, విద్యాసామగ్రిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సమక్షంలో అందించారు. పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పవన్ కళ్యాణ్ సందర్శించి విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, సిఆర్‌పి వెంకటరమణ, సంస్థ సభ్యులు కిరణ్, పురుషోత్తం, సిద్దు పాల్గొన్నారు.



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎండిహెచ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఎండిహెచ్ పవన్ కళ్యాణ్



విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందిస్తున్న దాతలు

దాతల సేవలు అభినందనీయం: ఎంఈవో

కార్వేటినగరం: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతలు పరీక్షా సామగ్రి వితరణ చేయడం అభినందనీయమని ఎంఈవో ఎం విజయకుమార్ ప్రశంసించారు. శుక్రవారం మండల పరిధిలోని డీఎం పురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యువత శ్రీకృష్ణ, విజయ్‌కుమార్‌లు విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీ యమన్నారు. యువతరంలోనే దాతృత్వాన్ని పెంచుకోవడం తన తల్లిదండ్రుల ఉన్నతిని గుర్తు చేస్తోందన్నారు. విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల కమిటీ ఛైర్మన్ త్యాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యనభ్యసించినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమవుతుందన్నారు. తల్లి దండ్రుల కష్టాలను దృష్టిలో వుంచుకుని విద్యాభ్యాసం చేయాలని పేర్కొన్నారు. ఈ క్రమంలో భాగంగా దాతలను హెచ్ఎం కేశవులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ఛైర్మన్ సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప తరలింపు

స్పందించని అధికారులు



యథేచ్ఛగా కలపను తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: యథేచ్ఛగా ట్రాక్టరులో కలపను కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. సంబంధిత అటవీ శాఖ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. బంగారుపాలెం మండలంలోని జాతీయ రహదారిపై ట్రాక్టర్‌తో కలప తరలింపు నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తు న్నారు. స్పందించాల్సిన సంబంధిత అటవీ శాఖ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్టు వ్యవ హరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆటవీ సంపద ఆవిరైపోతోందని అటవీ అధికారులు నిద్రావస్థలో వుంటు న్నారని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయి సిబ్బందిపై చర్యలు తీసుకుని కలపను అడ్డుకోవాలని లేదంటే పచ్చని వృక్షాలు కనుమరుగై పచ్చదనం దెబ్బతినే ప్రమాదం వుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

'మిద్దింటి'కి సత్కారం

ప్రజాశక్తి- చౌడేపల్లి: బోయకొండ మాజీ ఛైర్మన్ మిద్దింటి శంకరనారాయణను ప్రముఖ నటుడు, ఎంబియు యూనివర్సిటీ వ్యవస్థాపకుడు డాక్టర్ మోహన్ బాబు శుక్రవారం ఘనంగా సన్మానించారు. విద్యానికేతన్ లోని షిరిడి సాయిబాబా ఆల యానికి మిద్దింటిని ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం షిరిడి సాయిబాబా ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించారు.

గజ వాహనంపై శంకరుడు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: గజవాహనంపై బోళా శంకరుడు విహరించారు. మండలంలోని మొగిలిలోని స్వయంభు శ్రీ కామాక్షి సమేత మొగిలిశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు గజవాహనంపై బోళా శంకరుడిగా శుక్రవారం విహరించారు. ఉభయదారులుగా మొగిలి వారి పల్లికి చెందిన నందా , గాంధీ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. శుక్రవారం రాత్రి కామధేను వాహనంపై శివుడు విహరించాడు. ఉభయ దారులుగా బంగారు పాళ్యం మండలం నాయీ బ్రాహ్మణ సంఘం వారు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వంశపార ధర్మకర్త విజయ్ కుమార్, ఆలయ పరిశీలనాధికారి సుమన ప్రియ, అర్చకులు దండపాణి గురుకుల్, విశ్వనాథ్ గురుకుల్, సోమేశ్వర్ గురుకుల్, హరికేష్ గురుకుల్, పవన్ గురుకుల్ పాల్గొన్నారు.



మెగా జాబ్ మేళాలో 78 మంది ఎంపిక

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు లోని శ్రీ విద్య డిగ్రీ కళాశాలలో శుక్రవారం డాక్టరు రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయంతో ఐటి ఎస్, బ్యాంకింగ్,హెల్త్ కేర్ కంపెనీస్ తో మెగా జాబ్ మేలా నిర్వహించాము. ఈ జాబ్ మేళా కు సుమరు శ్రీ విద్య కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు పలమనేరు పరిసర ప్రాంతాలలోని యువతి, యువకులు 200 మంది హాజరయ్యారు. వారిలో 78 మందిని వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని శ్రీ విద్యా కళాశాల యాజమాన్యం ఐ మనోహర్, వైస్ ప్రిన్సిపల్ ఎం.వెంకటరమణ, తెలిపారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: సివి రామన్ జయంతి సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను సోక్రటీస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ దేవలం పేటలో ఘనంగా నిర్వహిం చారు. విద్యార్థులు శుక్రవారం వివిధ సైన్స్ నమూనాలను ప్రదర్శిం చారు. ఉత్తమ ప్రదర్శన చూపిన విద్యార్థులకు తిరుపతి జిల్లా ప్రైవేట్ స్కూల్ అధ్యక్షులు శ్రీధర్ బహుమతులు అందించారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ కరస్పాండెంట్ గుణశేఖర్, ఛైర్మన్ అనిత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'జ్ఞానజ్యోతి' శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-నింద్ర: నింద్ర మండలం ఉన్నత పాఠశాల, నింద్ర, జడ్‌పి ఉన్నత పాఠశాల కొత ఆరూరు లో అంగనవాడీ టీచర్లకి జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా ఆరురోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభమైంది.

డైయింగ్‌పై చర్యలు తీసుకోరా?

- హోరెత్తిన కౌన్సిల్ సమావేశం
- సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన
- టేబుల్ అజెండాగా కౌన్సిలర్ల సంతకాలు
- గొంతెత్తి అరుస్తున్నా ఫలితం లేదు
- కౌన్సిలర్లు ధృవీకరిస్తే ఉన్నతాధికారులకు పంపుతామన్న కమిషనర్

ప్రజాశక్తి -విజయపురం (నగరి) : డైయింగ్ యూనిట్ల వ్యవహారంపై మళ్లీ మున్సిపల్ కౌన్సిల్ హోరెత్తింది. భవిష్యత్తులో మంచినీళ్లు తాగడానికి కాదు.. చూడడానికి కూడా ఉండాలంటే డైయింగ్ యూనిట్లు మూసివేయడం ఒక్కటే మార్గమని కౌన్సిల్ ముక్త కంఠంతో తేల్చి చెప్పింది. మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ పీజీ నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మున్సిపల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. మొదట అధికారులు అజెండాను చదివి వినిపించారు. అజెండాలోని అంశాలు చదివిన అనంతరం విప్ దయానిధి, కౌన్సిలర్ బీడీ భాస్కర్ మాట్లాడుతూ గత రెండు సమావేశాల్లో చర్చనీయాంశమైన డైయింగ్ యూనిట్లపై 'ఏ చర్యలు తీసుకున్నారు?' అంటూ అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఏఈ వారికి వివరణ ఇస్తూ కౌన్సిల్ గత సమావేశాల్లో పేర్కొన్న మేరకు 16 మిషన్ డైయింగ్ యూనిట్లను తనిఖీ చేశామన్నారు. 12 యూనిట్లకు ఈటీపీ లేదని గుర్తించామని తెలిపారు. నాలుగు ప్లాంట్లలో ఒకటి మూత పడిందని మిగిలిన మూడింటికి ఈటీపీ ఉన్నా వారు నామమాత్రంగానే వినియోగిస్తున్నారన్నారు. తనిఖీకి వెళ్లే సమయంలో ఎవరో ముందస్తు సమాచారం ఇస్తున్నారని తాము వెళ్లిన సమయంలో ప్లాంట్లు రన్నింగ్‌లో ఉంటున్నాయన్నారు. అయితే ఆర్‌వో ఎనర్జీ మీటర్ ఇన్‌లెట్, అవుట్‌లెట్ రీడింగ్ మేరకు ఆ ప్లాంట్లు పూర్తి స్థాయిలో రన్నింగ్‌లో లేవని తేటతెల్లమైందన్నారు. ఈ వివరాలతో కూడిన నివేదికను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు పంపామన్నారు. రెండుసార్లు నోటీసులు ఇచ్చామని తెలిపారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి ఎలాంటి సమాచారం లేదన్నారు. వారు వస్తే సంయుక్తంగా ఈ అంశంపై చర్యలు చేపట్టే వీలుందన్నారు. దీనిపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలుగా ఈ సమస్యపై పోరాడుతున్నా ఎలాంటి చర్యలూ చేపట్టడం లేదంటే కౌన్సిల్ ఎందుకున్నారని వారికో సమావేశం ఎందుకు నిర్వహిస్తున్నారని అధికారులను నిలదీశారు. ప్రజలకు హాని కలిగించే రసాయన నీటిని నిలువరించలేక పోతున్నామంటే తాము చేతకాని పాలక వర్గం కిందే వస్తామన్నారు. దీనిపై కౌన్సిలర్ ఇంద్రయ్య మాట్లాడుతూ నేత పరిశ్రమ తొలినాళ్లలో పూర్తి స్థాయి ఆర్డర్లతో ఎంతో వైభవంగా జరిగిందన్నారు. అప్పట్లో ఇన్ని డైయింగ్ యూనిట్లు లేవన్నారు. ప్రస్తుతం నేత పరిశ్రమకు ఆర్డర్లు మందగించిందని స్థానిక నేత పరిశ్రమ వారే తెలుపుతున్నారన్నారు. ఈ దశలో ఎన్నడూ లేనన్ని రాక్షస డైయింగ్ యూనిట్లు నగరిలో ఏర్పాటు చేస్తున్నారంటే అందులో అంతరార్థమేమిటో అధికారులకు తెలియదా?' అని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాలలో బహిష్కరణకు గురైన డైయింగ్ యూనిట్ల వారు ఇక్కడ డైయింగ్ వేసి నీరు నగరి ప్రజలపై వదలుతూ వారు నూలును వారి రాష్ట్రాలకు తరలించుకుంటున్నారన్నారు. ఇందులో నగరి ప్రజలతో పాటు నేత కార్మికులు కూడా నష్టపోతున్నారన్న అంశాన్ని అర్థం చేసుకోవాలన్నారు. వైస్ ఛైర్మన్ వెంకటరత్నం మాట్లాడుతూ డైయింగ్ యూనిట్ మూసివేత అంశాన్ని అజెండాలో ఉంచితే తాము ఆమోదించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 'ఇప్పుడే రాసి సంతకాలు చేసి ఇవ్వండి..' అని కమిషనర్ కోరగా కౌనిలర్లు అందరూ సంతకం చేస్తే టేబుల్ అజెండాగా పెట్టేస్తామని మున్సిపల్ ఛైర్మన్ తెలిపారు. వెంటనే తెల్లకాగితంపై డైయింగ్ యూనిట్ల మూసివేత అంశాన్ని పొందుపరచి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సంతకాలు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బాలన్, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



టేబుల్ అజెండాపై సంతకాలు చేస్తున్న కౌన్సిలర్లు

పెరిగిన వరి సాగు

- చెరువులు, కుంటల్లో నీరు
- అధిక దిగుబడులకు అవకాశం
- రైతుల్లో ఆనందం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ఎండకు, వానకు రంగులు మారే వరిచేనే ఆహ్లాదకరం.. మండలంలో ఈ ఏడాది వరి నాట్లు అనూహ్యంగా పెరిగాయి. రెండు నెలల క్రితం సకాలంలో వానలు కురవడం వల్లే చెరువులు, కుంటల్లో నీరు సంమృద్ధిగా వున్నాయి. దీంతో మండలంలో వరి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. పంట పచ్చగా కళకళలాడుతుండడంతో దిగుబడి బాగా వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువులు, కుంటల్లో సంమృద్ధిగా నీరు

గంగాధర నెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురు కుప్పం మండలంలో 25 పంచాయతీలు, 222 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో ఒకటో రెండు చెరువు లు, కుంటలు ఉన్నాయి. ఇవి రెండు నెలల క్రితం కురిసిన వర్షానికి బాగా నిండి నిండు కుండలా తొణికిసలాడు తున్నాయి. భూమిలో నీటి శాతం బాగా పెరిగింది. బావులు, బోరు బావుల్లో నీళ్ల సమృద్ధిగా వున్నాయి. దీంతో రైతుల ఆశలకు జీవం పోసినట్లు అయింది. కట్ట, మిట్ట అంతా చదును చేసి , జనవరి మొదటి వారంలో వరి నాట్లు, మరి కొంత మంది డ్రం సీడర్‌తో వరి పంట వేశారు. ప్రస్తుతం అంతా పొట్ట దశలో వుంది. రైతు కుటుంబాలు వరి పంట బాగా ఉండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో ఆనందం

పచ్చపైరు ఏ చీడ పీడలు లేకుండా ఇలాగే కొనసాగితే మంచి దిగుబడి వస్తుందని పెట్టిన పెట్టుబడి, చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కి అధనపు ఆదాయం సమకూరి కష్టాలు తీరే అవకాశం వుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రైతుల పొలాలోల కళకళలాడుతున్న వరి పంట

పెరిగిన విస్తీర్ణం

గత సంవత్సరం కంటే ఈసారి వరి పంట విస్తీర్ణం బాగా పెరిగింది. పండించే రైతులు ఎక్కువయ్యారు.

- వనిత, వ్యవసాయాధికారి, వెదురుకుప్పం.



వరి, చెరకు సాగు విస్తీర్ణం

(2024) లో		
వరి	-	287 హెక్టార్లు
చెరుకు	-	432 హెకార్లు
(2025) లో		
వరి	-	482 హెక్టార్లు
చెరుకు	-	376 హెక్టార్లు



జామియా మసీదు అధ్యక్షుడు పి హమీదాఖాన్ సన్మానిస్తున్న దృశ్యం

మసీదు అభివృద్ధికి కృషి

జామియా మసీదు అధ్యక్షుడు పి హమీదాఖాన్

ప్రజాశక్తి -కార్వేటినగరం: మసీదు అభివృద్ధికి నిత్యం కృషి చేస్తానని జామియా మసీదు నూతన అధ్యక్షుడు పి హమీ దాఖాన్ పేర్కొన్నారు. జామియా మసీదు కార్యవర్గ సమా వేశం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మసీదు నూతన అధ్యక్షుడు హమీదాఖాన్ మాట్లాడుతూ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా తనను ఎంపిక చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నిత్యం అందుబాటులో ఉంటూ ముస్లిం సోదరులు, మసీదు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో మరో సారి మసీదు అధ్యక్షుడిగా ఎన్నుకు న్నందుకు మత పెద్దలకు, ముస్లిం సోదరులకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. అనంతరం హమీదాఖాన్‌ను శాలువలు కప్పి పూల మాలలతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా టైలర్స్‌డే



విలియమ్స్‌కు నివాళులర్పిస్తున్న దర్జీలు

ప్రజాశక్తి -చౌడేపల్లి: అంతర్జాతీయ టైలర్స్ డేను చౌడేపల్లిలో ఘనంగా నిర్వహిం చారు. స్థానిక గాంధీ బొమ్మ వద్ద కుట్టు మిషన్ ఆవిష్క రణ కర్త విలియమ్స్ చిత్రపటాన్ని ఉంచి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన జీవిత చరిత్రను అందరికీ తెలిపారు. ప్రస్తుతం టైలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా నాయకులు ప్రభాకర్, వెంకటరమణ, తుంగ రమేష్, సురాజిన్‌బి, షౌకతాబి, సులోచన గాయత్రి మండల దర్జీలు పాల్గొన్నారు.

విజయపురం (నగరి): స్థానిక టైలర్స్ సంక్షేమ సంఘ సంఘ సభ్యులు ఓంశక్తి ఆలయం నుంచి బస్టాండు ప్రాంగణం వరకు ఘనంగా ర్యాలీ నిర్వహించారు. సంఘ కార్యాలయం వద్ద కేక్ కత్తిరించి సంబరాలు చేసుకున్నారు. అనంతరం స్థానిక సిరీడ్స్ బదిర పాఠశాలలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎం.ఉమాపతి, టి.వీరయ్య, సంఘ గౌరవ ఉపాధ్యక్షులు ఎన్ నాగూర్ భాషా, ఉపకార్యదర్శి కె.రాజ, కోశాధికారి కె. కృష్ణయ్య, సలహాదారులు పి.రాజేంద్రరెడ్డి, ఎక్జిక్యూటివ్ మెంబర్స్ ఎం.గణేశ్, హమీదు, హాతింబాయ్, ధనరాజ్, నటరాజ్, రాధమ్మ, పళని, శంకర్, జైలా, శ్రీనివాసులు, మునిరత్నం రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

మహిళల ఉత్పత్తులు గుర్తించాలి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మహిళా ఉత్పత్తులు గుర్తిం చాలని ఏపిఎం రవికుమార్ పేర్కొన్నారు. ఎంపిడివో కార్యా లయంలో సంఘమిత్రలతో శుక్రవారం మండల అభివృద్ధి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతంలో మహిళ లు తయారు చేసే ఉత్పత్తు లను గుర్తించే విధంగా చూడాల్సిన బాధ్యత వెలుగు శాఖపై వుందన్నారు.

జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారులకు ప్రశంస

ప్రజాశక్తి- యాదమరి: జాతీయ స్థాయిలో జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించిన ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో పాల్గొన్న యాదమరి విద్యార్థులను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారిని కలిశారు. యాదమరి ఉన్నత పాఠశాల విద్యార్థులు కమల్, ఫాతిమా, మానస, యుగభారతిలను జిల్లా విద్యా శాఖాధికారి అభినందించారు. జమ్ము కాశ్మీర్ లో పోటీల్లో పాల్గొని వచ్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు. విద్యార్థులతో పాటు యాదమరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరి రాజారావు, వ్యాయామ ఉపాధ్యాయులు రవి, హరికృష్ణ, దాము, కృష్ణారెడ్డి, ఉదయ్ పాల్గొన్నారు.



జాతీయ ఫెన్సింల్ క్రీడాకారులను సన్మానిస్తున్న డిఇవో

రైతు సంక్షేమం కోసమే విశిష్ట గుర్తింపు నమోదు

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : కుప్పం మండలం పరిధిలో రైతు విశిష్ట గుర్తింపు నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ అడవి ములకలపల్లి గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ జయసుధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి మణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకాలు అర్హు లందరికీ అందాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రైతు విశిష్ట గుర్తింపు మంజూరు చేయాలని నిర్ణయించారన్నా రు. ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం తమ గ్రామంలో రైతు విశిష్ట గుర్తింపు నమో దు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవ కాశాన్ని రైతులు సద్వినియోగం చేసు కుని వారి వివరాల నమోదుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.



గుర్తింపు నమోదు చేసుకుంటున్న రైతులు

ఘనంగా జెవివి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -బంగారుపాలెం: జన విజ్ఞాన వేదిక 38వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించామని జిల్లా జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షులు అరుణ్ శ్రీ ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మంగళ పల్లి టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక 38వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు హెచ్ అరుణ శివప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ దినోత్సవం రోజే 1988 ఫిబ్రవరి 28న జన విజ్ఞాన వేదిక ఆవిర్భవించిందని ప్రజల్లో మూఢ నమ్మకాలను తొలగించడం కోసం సైన్స్ మ్యాజిక్ షో ను నిర్వహించారు. ఈ మ్యాజిక్ షోలో చేతిలో కర్పూరం వెలిగించి నోట్లో వేసుకోవడం, విద్యార్థి తలపై మంట వెలిగించడం, శూలాన్ని నాలుకపై గుచ్చుకోవడం, తదితర వాటిపై మ్యాజిక్ ను నిర్వహించి అందులో దాగి ఉన్న సైన్స్ నియమాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం సైన్స్ దినోత్సవ కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి అబ్దుల్ ... ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ దినోత్సవ సందర్భంగా పాఠశాలలో అనేక ప్రయోగాలను నిర్వహించారని దీని ద్వారా శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు మూఢనమ్మకాలపై, సైబర్ నేరాలపై లఘు నాటికలు ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. సైన్సు ఉపాధ్యాయులు సంషీర్ ఖాన్, విజయ్, కుమారి, పిల్లారప్ప, ప్రేమ కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రమాదేవి సంజీవి భారతి ధన శేఖర్ మోహన్ రెడ్డి సంపంగి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మ్యాజిక్‌ను ప్రదర్శిస్తున్న జెవివి నాయకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - రామకుప్పం: రామకుప్పం శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్య స్వామి ఆలయ కమిటీ సహకారంతో శుక్రవారం కుప్పం ఆర్‌ఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 30 మందికి ఈసీజీ, 101 మందికి షుగర్, 76 మందికి కిడ్నీ పరీక్షలు, సాధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 127 మంది రోగులకు వైద్య శిబిరానికి విచ్చేయగా వారికి పరీక్షలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ రోగులకు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడిపి మండల అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, సీతాపతి, చంద్రారెడ్డి, కుప్పం మున్సిపల్ వైస్ ఛైర్మన్ అఫీజ్ , డాక్టర్ సురేష్ మణిరత్నం, డాక్టర్ విష్ణు, వైద్య సిబ్బంది, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి: కమిషనర్

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ రుణాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పురపాలక సంఘం కమిషనర్ శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. కుప్పం పట్టణం లోని పురపాలక సంఘం కార్యాలయ ఆవరణలో శుక్రవారం కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రాయితీ రుణాలు అమలు చేస్తున్నారన్నారు. వీటిని లబ్ధిదారులు సక్రమంగా చెల్లించి బ్యాంకు వారికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము, నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు జాకీర్ రహ్మద్, కౌన్సిలర్లు సురేష్, సోము, పలు బ్యాంకుల అధికారులు, ప్రతినిధులు, రుణాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గాయపడ్డ యువకుడు మృతి



చికిత్స పొందుతూ మృతి చెందిన గోవర్ధన్

ప్రజాశక్తి -కార్వేటినగరం: చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై గురువారం అన్నూర వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు శుక్రవారం వేకువ జామున మృతి చెందాడని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వెదురుకుప్పం మండలం చవట గుంట గ్రామానికి చెందిన గోవర్ధన్ కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి దళితవాడలో తన అత్త ఇంటికి వెళ్లి స్వగ్రామానికి ద్వాచక్రవాహనంలో తిరుగు వెళుతూ అన్నూరు బస్ స్టాపు వద్ద బస్సు కోసం వేచి ఉన్న చొక్కలింగం (66)ను వేగంగా వచ్చి ఢీ కొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై పడిన గోవర్ధన్(33) తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం తిరుపతికి తరలించారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం వేకువ జామున గోవర్ధన్ మృతి చెందాడు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

బోరు మోటారు వైరు, స్టార్టరు చోరీ

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం పేటూరు పంచాయతీ బోనమంద గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే రక్షిత మంచినీటి బోరు బావి మోటారుకు అమర్చిన కేబుల్ వైరు, స్టార్టరు, ఆటోమేటిక్ సిస్టం చోరీకి గురి కావడంతో గుర్తించిన పంచా యతీ కార్యదర్శి శుక్రవారం సాయంత్రం సోమల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోనమందలో వంద కుటుంబాలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. శుక్రవారం ఉదయం గ్రామానికి దూరంగా ఉన్న రక్షిత మంచినీటి బోరు మోటారు ఆన్ చేసి తాగునీరు గ్రామానికి వదిలేందుకు వెళ్లి చూడగా కేబుల్ వైరు, స్టార్టరు ఆటోమేటిక్ సిస్టం మొత్తం చోరీకి గురి అయ్యి ఉండడం గ్రామస్తులు గుర్తించారు. దీంతో సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శి జగదీష్ కు తెలిపారు. ఆయన శుక్రవారం సాయంత్రం చోరీ విషయాన్ని పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి పదివేల రూపాయల నష్టం కలిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.




చోరీకి గురైన బోరు మోటారు వైరు

బెల్లం పాకంలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : బెల్లం పాకంలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు..ఎస్ఆర్ పురం మండలంలోని వెంకటాపురం గ్రామపంచాయతీ వెంకటాపురం గ్రామంలో సుబ్బయ్య కుమారుడు ప్రేమ్ దాస్ (46) గురువారం రాత్రి చెరుకు గానుగ వద్ద వేడిగా ఉన్న బెల్లం పాకంలో ప్రమాదవశాత్తు పడి ప్రేమ్ దాస్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు.

రైతుల పంటలు ధ్వంసం



ఏనుగుల దాడిలో ధ్వంసమైన కొబ్బరి చెట్లు

ప్రజాశక్తి -రొంపిచర్ల :పులిచెర్ల మండలంలోని పాతపేట గ్రామ పరిధిలోని రైతుల పంటలను ఏనుగు ధ్వంసం చేసిందని గ్రామస్తులు తెలిపారు. పాత పేటకు చెందిన రైతులు సుబ్రహ్మణ్యం, వెంకటరత్నం, సురేష్, నందగోపాల్‌లకు చెందిన కొబ్బరి చెట్లు, వేరుశనగ, బొప్పాయి, వరి, మల్బరీ పంటలను గురువారం రాత్రి ఒంటరి ఏనుగు తీవ్ర నష్టం కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ శాఖ ఎఫ్ బి ఓ శ్రీదేవి ధ్వంసమైన పంటలను పరిశీలించారు.

వడ్డీ డబ్బుల వ్యవహారంలో ఘర్షణ

పలువురికి గాయాలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: వడ్డీ డబ్బు వ్యవహారంలో ఇరు గ్రూపుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణలో పలువురు గాయపడ్డ సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. బైరెడ్డిపల్లి మండలం, గంగినాయన పల్లి పంచాయతీ పరిధిలోని కొత్త ఇండ్లుకు చెందిన పి సుబ్బమ్మ (38) అదే గ్రామంలోని వెంకటేష్‌కు సుబ్బమ్మ 70 వేల రూపాయలు అప్పుగా ఇచ్చింది. పలుమార్లు అడిగినా వెంకటేశు డబ్బులు ఇవ్వకపోవడంతో గురువారం సాయంత్రం నాలుగు గంటలకు సుబ్బమ్మ వెంకటేష్ భార్య అయిన రూపానిని డబ్బులు ఇవ్వమని అడిగింది. అదే రోజు రాత్రి 9 గంటలకు వెంకటేశు వెంకటేష్ భార్య రూపాని అతని కొడుకు హరి, జమున వెంకటేష్ బంధువులైన నారాయణప్ప, నారాయణప్ప కొడుకు నవీన్ కుమారు, వెంకటేష్ తమ్ముడు శివకుమార్‌లు సుబ్బమ్మ ఇంటి ముందు కూర్చొన్న సుబ్బమ్మను ఇనుప రాడ్డుతో తలపై కొట్టారు. అదే సమయంలో ఆ గ్రామానికి చెందిన శశి కుమార్ అడ్డు రాగా శశి కుమార్‌ను సైతం రాడ్‌తో కొట్టారు. గాయపడిన సుబ్బమ్మను, శశి కుమార్‌ను చికిత్స నిమిత్తం108 సాయంతో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 21 /2025 గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరశురాముడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడుగా షేక్ ఫిరోజ్ అహ్మద్



ప్రజాశక్తి -బంగారుపాళ్యం: చిత్తూరు జిల్లా ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షుడిగా షేక్ ఫిరోజ్ అహ్మద్‌ను ఎంపిక చేశామని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఫిరోజ్ అహ్మద్ సేవలు గుర్తించి జిల్లా అధ్యక్షు లుగా ఎంపిక చేశారని, ఆయన గతంలోనే సమాజ సేవతో గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కరోనా సమయంలో కోవిడ్ మృతదేహాలకు దహనక్రియలు ఆపద్బాంధవుడు అయ్యారని, అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తు న్నారన్నారు. ఆయన సేవలను గుర్తించి జిల్లా ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షులుగా ఎంపిక చేశారన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ పదవి వచ్చేందుకు సహకరించిన ప్రతి ముస్లింకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

ప్రజాశక్తి -సోమల: ఇరికిపెంట పంచాయతీ పార్వతీ నగర్ దళితవాడలో తహశీల్దారు బెన్ను రాజ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ , వైద్య తదితర శాఖలవారు పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. పౌర హక్కులు ఎలా సద్విని యోగం చేసుకోవాలో వివరించారు.